

అచ్చ తెలుగులో అన్నమయ్య కీర్తనలు

అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నమాచార్య కళాభవనంలో నదస్సు నిర్వహించారు.

- 8లో



మాక్ డ్రిల్

ఎన్నికల కౌంటింగ్ రోజు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు.

- 8లో



న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ

రాయలసీమ జిల్లాలోని న్యాయమూర్తులను వివిధ అంశాలపై నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి.

- 8లో

న్యూస్‌రీల్

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో... బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

తిరుపతి అర్బన్ : సాక్షి, మైత్రి మహిళా ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి జూన్ 25వ తేదీ వరకు మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుంది. ఈ మేరకు త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డాండ్రఫ్ ట్రీట్మెంట్, హెయిర్ ఫాల్ ట్రీట్మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యునికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్, శారీ డ్రాపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు అందిస్తారు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ లోపు బైరాగిపట్టెడలో ఆర్చి రోడ్డులోని అనంగా బ్యూటీ స్టూడియో ట్రైనింగ్ సెంటర్‌లో రూ.3 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 9553454335, 8555974855 నంబర్లలో సంప్రదించాలి.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్ పరిశీలనలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో పక్కాగా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. భారీ కేడింగ్, సీటింగ్, భద్రత తదితర అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్, సీసీ టీవీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను సందర్శించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, అదనపు ఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు, రిటర్నింగ్ అధికారులు రవిశంకర్‌రెడ్డి, నరసింహులు, సర్వే అధికారి జయరాజ్ పాల్గొన్నారు.

శిక్షణకు 14 మంది డుమ్మా

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్యంలో బాధ్యతతో కూడిన అంశమని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా చేపట్టాల్సి ఉందన్నారు. అయితే కొందరు ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు రెండో విడత శిక్షణకు డుమ్మా కొట్టారని చెప్పారు. అందులో 14 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. అందులో ఐదుగురు ఉద్యోగులు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో వారిని సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు. అలాగే పోలింగ్ విధులకు 272 మంది ఉద్యోగులు గైర్హాజరయ్యారని, వారికి సైతం షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. 5 రోజులలో వారి నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వేడుకగా నమ్మాళ్వార్ శాత్తుమొర



శాత్తుమొర నిర్వహిస్తున్న పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి తదితరులు

తిరుపతి కల్చరల్ : కపిలతీర్థం సమీపంలోని ఆళ్వార్ తీర్థంలో కొలువైన నమ్మాళ్వార్ సన్నిధిలో శుక్రవారం వైభవంగా శాత్తుమొర నిర్వహించారు. ఈ పురాతన ఆలయంలో రామానుజాచార్యులు తొలిసారి తిరుపతికి వచ్చినప్పుడు ఒక ఏడాది పాటు ఇక్కడే ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆ సమయయంలో ఆచార్యులవారు అలిపిరి పాదాల మండపం వద్ద రామాయణ కాలక్షేపం, అధ్యయనం చేసేవారని పేర్కొనబడి ఉంది. అప్పుడే ఈ ఆలయంలో నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్, రామానుజులు, తిరువరంగత్తు ఆముదనార్ విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. నమ్మాళ్వార్ శాత్తుమొర కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొన్నారు.

పరిపూర్ణం.. కోన సంబరం

పెనుశిల శ్రీలక్ష్మీ నృసింహుని బ్రహ్మోత్సవ వైభవం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లింది.. ఉభయ దేవేరీ సమేతంగా కొలువైన శ్రీవారిని వీక్షించి భక్తకోటి పులకించింది.. పవిత్ర పుష్కరిణిలో చక్రత్తాళ్వార్ సన్నిధిలో పుణ్యస్నానమాచరించి పునీతమైంది.. తిరుమంజన సేవలో సేదతీరుతున్న మహిమాన్విత మూర్తులను దర్శించుకుని తన్మయత్వం చెందింది.. వసంతోత్సవ ఘట్టంలో పాలుపంచుకుని మైమరచింది.. తెప్పలపై కొలువుదీరి విహరిస్తున్న దేవదేవేరుల అనుగ్రహం పొంది తరించింది.



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న దేవదేవేరులు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

- ఘనంగా ముగిసిన పెనుశిల బ్రహ్మోత్సవాలు
- నృసింహునికి విశేష అభిషేకాలు
- శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించిన అర్చకులు
- తెప్పపై ఊరేగిన దేవదేవరులు

రాపూరు : పెంచలకోనలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఉదయం శ్రీవారి చక్రస్నాన ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లతోపాటు చక్రతాళ్వార్‌ను పల్లకిలో కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా శ్రీవారి నందన వనంలోని పుష్కరిణి వద్ద మండపంలోకి వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ పుష్కరిణిలో చక్రతాళ్వార్‌కు స్నానం చేయించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు పవిత్ర పుష్కరిణిలో స్నానమాచరించి తన్మయత్వం చెందారు. మూడుసార్లు చక్ర స్నానం చేయించారు.

వైభవంగా వసంతోత్సవం

స్వామివారి అలంకార మండపంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా పెంచలస్వామివారిని కొలువుదీర్చారు. అనంతరం వేడుకగా వసంతోత్సవం నిర్వహించారు. దేవదేవేరులకు ప్రత్యేక పూజలు చేపట్టి విశేష అభిషేకాలు జరిపించారు.

తెప్పోత్సాహం

శోభాయమానంగా అలంకరించిన తెప్పపై పెనుశిల నృసింహస్వామి ఉభయనాంచారులతో కలసి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 10 గంటలకు స్వామివారిని అశ్వవాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరిపించి బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. కార్యక్రమాల్లో కార్యక్రమంలో డీసీ విజయ సాగర్‌బాబు, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతా రామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

నేడు గోనుపల్లెలో గ్రామోత్సవం

స్వామి అమ్మవార్లకు శనివారం రాత్రి గోనుపల్లె గిరిజనకాలనీలో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.





శ్రీవారి సేవలకు హాజరైన భక్తులు, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి సమేతంగా కొలువైన పెంచలస్వామివారు



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి సేవలో కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్



మాట్లాడుతున్న డీఎస్పీ రవి మనోహరాచారి

తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ రవి మహోహరాచారి తెలిపారు. శుక్రవారం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ తర్వాత తిరుపతిలో జరిగిన హింసాత్మక ఘటనలపై ఇప్పటికే తగు చర్యలు తీసుకున్నామన్నారు. కేసులకు సంబంధించిన అన్ని పార్టీల వారిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. ఎక్కడా అమాయకులపై కేసులు పెట్టి ఇరికించలేదని, చట్ట ప్రకారమే అరెస్టులు జరిగాయని వివరించారు. కౌంటింగ్ రోజున సమస్యలు సృష్టించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిని ముందస్తుగానే గుర్తించి బైండోవర్ చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున గెలిచిన వారితోపాటు ఓడిన వారికి కూడా ఎస్కార్ట్ ఇచ్చి నేరుగా ఇంటికి పంపనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే అనుమతి తీసుకుని సంబరాలు జరుపుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజు విజయోత్సవ ర్యాలీలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

భక్తులకు మాత్రమే రూమ్‌లు

జూన్ 1 నుంచి 4వ తేదీ రాత్రి వరకు తిరుపతిలోని అన్ని లాడ్జిల్లో శ్రీవారి దర్శనానికి వచ్చిన వారికి మాత్రమే రూమ్‌లు కేటాయించాలన్నారు. రాజకీయ నాయకులు, ఇతర పనులపై వచ్చిన వారికి రూమ్‌లు కేటాయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో నిరంతరం లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో యూనివర్సిటీ సీఐ మురళీమోహన్ పాల్గొన్నారు.

అమ్మను చంపేశారు?

'అమ్మా ఎక్కడున్నావ్..? నన్నొదిలి ఎందుకెళ్లావ్..? విధి ఆడిన వింత నాటకంలో ఆస్పత్రి సిబ్బందే మా అమ్మను దూరం చేశారు.. ఎందుకింత శిక్ష వేశారు..'అన్నట్టు ఆ బిడ్డ ప్రశ్నిస్తూ.. ఎక్కిళ్లు పెడుతుంటే చూపరుల కళ్లు చమర్చాయి. బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే ఓ బాలింత మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన శుక్రవారం గూడూరు ప్రభుత్వాస్పత్రిలో తీవ్ర విషాదం మిగిల్చింది.

- మగబిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే బాలింత మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు
- ఆస్పత్రి వద్ద ధర్నా.. పోలీసులకు ఫిర్యాదు

గూడూరు రూరల్: మగ బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే ఓ బాలింత మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో తీవ్ర కలకలం రేపింది. వివరాలు.. గూడూరు రూరల్ పరిధిలోని చవటపాళెంకు చెందిన వేముల హరిక్రిష్ణ, తిరుపతిలోని మంగళం గ్రామానికి చెందిన శ్రావణికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర పాప ఉంది. శ్రావణి మళ్లీ గర్భం దాల్చడంతో ఉప్పొంగిపోయారు. కొడుకు పుడతాడని, కుమార్తెకు తోడుగా ఉంటాడని కలలుగన్నారు. ఆస్తిపాస్తులేమీ లేకపోయినా కూలిపనులు చేసుకుంటూ.. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరోగ్యాన్ని చూపించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో భర్త హరిక్రిష్ణ బంధువులతో కలిసి శ్రావణిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆపై కూలిపనులు ఉండడంతో వెళ్లిపోయాడు. మధ్యాహ్నం శ్రావణికి పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో డాక్టర్లు ఆపరేషన్ చేసి పురుడు పోశారు. పండంటి మగబిడ్డ జన్మించడంతో తల్లితోపాటు కుటుంబ



మృతి చెందిన శ్రావణి

సభ్యులు బంధువులకు ఫోన్లు చేసి సంతోషం పంచుకున్నారు. కానీ వారి ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. ఏమైందో ఏమోగానీ శ్రావణి అపస్మారక స్థితికి చేరిందని, వెంటనే నెల్లూరుకు తీసుకెళ్లాలని డాక్టర్లు సెలవిచ్చారు. ఇంతలో అంబులెన్స్ మాట్లాడి నెల్లూరుకు తీసుకెళ్లగా శ్రావణి మృతి చెంది గంటకు పైగా అయ్యిందని అక్కడి డాక్టర్లు నిర్ధారించారు. శ్రావణికి రెండో కాన్పు కావడంతో సిజేరియన్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని.. ఆమె ఆరోగ్యం విషమించినా డాక్టర్లు ఎందుకు చెప్పలేదని మృతురాలి కుటుంబ సభ్యులు డాక్టర్లు నిలదీశారు. కానీ వాళ్లెవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో శ్రావణి మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద ఉంచి నిరసన వ్యక్తం చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో చేసేది లేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలింత మృతిపై వివరణ కోరేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్‌తోపాటు ఇతర వైద్యులను 'సాక్షి' సంప్రదించగా వారు అందుబాటులో లేరు.

కౌంటింగ్‌పై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగికీ కౌంటింగ్‌పై అవగాహన తప్పనిసరని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన కౌంటింగ్ సందర్భంగా సిబ్బంది ర్యాండమైజేషన్ సజావుగా చేపట్టామన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు 310 మందికి గాను 311 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 383 గాను 395 మంది, మైక్రో అబ్జర్వర్లు 346 గాను 347 మందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొత్తం 1,039 మంది 208 కౌంటింగ్ టేబుళ్లకు అవసరమైన నేపథ్యంలో రిజర్వ్‌తో కలిపి 120 శాతంతో 1,053 మందిని కేటాయించామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పెంచలకిషోర్, నోడల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, ఎన్ఐసీ డీఐఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

27న ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 27వ తేదీన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్, టెక్ మహీంద్రా సంస్థ ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపడతారని వెల్లడించారు. ఐటీఐ (కోపా) పాసైన వారు, ఇంటర్ పాస్/ఫెయిలైన వారు రిక్రూట్‌మెంట్‌కు హాజరయ్యేందుకు రావచ్చన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఎస్ఎస్‌సీ, ఐటీఐ ప్రొవిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు 96764 86678, 85000 21856 నంబర్లలో ట్రైనింగ్ ఆఫీసర్ విక్రమ్‌ను సంప్రదించాలని కోరారు.

వైభవం.. వసంతోత్సవం

- శోభాయమానంగా ముగిసిన సంబరాలు



పద్మావతీదేవికి తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వార్షిక వసంతోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఊరేగింపుగా శుక్రవారపు తోటకు వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. అందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, పలురకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహాపూర్ణాహుతితో అమ్మవారి వసంతోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. కార్యక్రమంలో జేఈఓ గౌతమి, డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, సుభాష్ పాల్గొన్నారు.





అమ్మవారికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు, సిరులతల్లికి విశేషాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కౌంటింగ్.. కౌంట్‌డౌన్

- మరో పదిరోజుల్లో ఓట్ల లెక్కింపు
- ఎన్నికల ఫలితాలపై పెరుగుతున్న ఉత్కంఠ
- జూన్ 4వ తేదీన తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. ఎన్నికల ఫలితాలపై అందరికీ ఉత్కంఠ పెరిగిపోతోంది. ఓట్ల లెక్కింపునకు మరో పదిరోజులు మాత్రమే మిగిలి ఉండడంతో ప్రజానీకం సైతం జూన్ 4వ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హోరాహోరీగా తలపడిన అభ్యర్థులు తమ విజయావకాశాలపై అంచనాలు వేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల శాతంపై లెక్కలు తీస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు సైతం కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలు.. అభిమానులు సహకరించాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు. మీడియా ద్వారా ప్రకటనలు విడుదల చేస్తున్నారు.

ఆధిక్యంపై లెక్కలు

సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్లు దాటి ఇంటికే పరిమితమైనన 583 మంది ఓటర్లు హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. అలాగే ఇంటికే పరిమితమైన దివ్యాంగులు 485 మంది సైతం హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు (ఫైల్)

ఓటర్లు 20,153 మంది సద్వినియోగం చేసుకున్నారు. మరోవైపు ఈవీఎంల ద్వారా అసెంబ్లీకి 14,25,477 మంది ఓటర్లు, పార్లమెంట్‌కు 13,68,324 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వాడుకున్నారు. వీరిలో ఎవరికి ఎక్కువ మంది ఓటేశారు. ఏపార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి. ఏ నియోజకవర్గలో ఎవరికి ఎంత ఆధిక్యం వచ్చే అవకాశముందని జనం చర్చించుకుంటున్నారు.

అందరి చూపు పోస్టల్ బ్యాలెట్ పైనే..

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులతోపాటు అత్యవస సేవలను అందించే వివిధ విభాగాల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలో 20,153 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. అయితే 2019 ఎన్నికల్లో 20శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వివిధ కారణాలతో చెల్లుబాటు కాలేదు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి గెజిటెడ్ అధికారి సంతకం ఉంటేనే బ్యాలెట్ ఓటు చెల్లుతుంది. ఈ క్రమంలో పలువురు గెజిటెడ్ అధికారి సంతకం లేకుండా వేశారనే చర్చ సాగుతోంది. ఈ అంశంపైనే అంతా మాట్లాడుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న తరుణంలో అన్ని కోణాల నుంచి లెక్కలు వేస్తున్నారు. మొత్తంగా కౌంటింగ్‌కు రోజులు దగ్గర పడుతున్న కొద్ది ఫలితాలపై చర్చ జోరుగా సాగుతోంది.

పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు.ఆ మేరకు 30 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. 90 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. వందలాది మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : పది, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతికి 2,318మంది హాజరు కావాల్సి ఉండగా 829మంది మాత్రమే హాజరయ్యారు. 1,489మంది గైర్హాజరయ్యారు. అలాగే ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 7,220మందికి 6,740మంది పరీక్షకు హాజరయ్యారు. 480 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 983మందికి 872మంది పరీక్షకు హాజరయ్యారు. 111మంది గైర్హాజరైనట్లు డీఈఓ శేఖర్, ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వివరించారు.

రాపూరు డిపోకు రూ.10.9లక్షల రాబడి

రాపూరు : పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వివిధ మార్గాల్లో 30 ప్రత్యేక బస్సులు నడిపినట్లు డీఎం అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగించారని, ఆర్టీసీకి రూ.10.9లక్షల రాబడి వచ్చినట్లు వివరించారు.

రియల్టర్లకు నోటీసులు

పెళ్లకూరు : మండలంలోని తాళ్వాయిపాడు వద్ద స్వర్ణముఖీనది సమీపంలో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన లే అవుట్ యజమానులకు శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు ఆర్ఐ సంతోషినిబాయి తెలిపారు. సీలింగ్ భూములను కబ్జా చేసి లేఅవుట్‌కు రోడ్డు వేయడంతో పాటు ప్రహరీగోడ నిర్మించడంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రహరీగోడ వెంటనే తొలగించాలని సంబంధిత రియల్టర్లకు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో ప్రహరీగోడ తొలగించకపోతే కేసులు నమోదు చేయించి యంత్రాలతో గోడ తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న టిప్పర్‌తో వీఆర్‌ఓ

పెళ్లకూరు : మండలంలోని రోసనూరు, బంగారంపేట నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను శుక్రవారం వీఆర్‌ఓ రవీంద్రబాబు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీసులకు అప్పగించారు.

'దివ్య'మైన భవిత

- జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు
- సహకారం అందిస్తున్న ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు,
- ఇప్పటి వరకు 205 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి



సత్యవేడు మండలంలో సర్వే చేస్తున్న సిబ్బంది

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించేందుకు జిల్లాలోని 34 భవిత కేంద్రాల ఐఈఆర్పీ(ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థి దశలోని మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పించడం, ఫిజియోథెరపీ ఇవ్వడం, వారికి అవసరమైన పరికరాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే భవిత కేంద్రాలకు రాని ఇలాంటి ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి బంగారు భవిత అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులకు భరోసా కల్పించి వారిని భవిత కేంద్రాలకు రప్పించేలా ఐఈఆర్పీలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం కలిగిన వారిని గుర్తించడంలో నిమగ్నమయ్యారు.

క్షేత్రస్థాయిలో గుర్తింపు

జిల్లాలోని 34 భవిత కేంద్రాల్లో 626 మంది మానసిక, బుద్ధి మాంద్యం కలిగిన విద్యార్థులు ఉన్నారు. వీరిలో అవసరమైన వారికి వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. గత ఏడాది నిర్వహించిన సర్వేలో భవిత కేంద్రాలకు రాకుండా ఇంటి వద్ద 145 మంది ఉన్నట్లు గుర్తించారు. ఈ సమాచారంతో ఈ ఏడాది సెలవు రోజుల్లోనే సర్వే చేయాలని అధికారులు ఐఈఆర్పీలను ఆదేశించగా స్థానిక అంగన్‌వాడీలు, ఏఎన్ఎంల సాయంతో సర్వే ప్రారంభించారు. ఐఈ కో–ఆర్డినేటర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ వి.రామచంద్రారెడ్డి, ఐఈఆర్పీ వి.వెంకటరత్నం ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి ఇప్పటి వరకు 205 మంది విద్యార్థులను గుర్తించారు.

పిల్లలకు అలవెన్సులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు నాలుగు రకాల అలవెన్సులను ప్రభుత్వం అందిస్తోంది. వీటిలో బడికి వచ్చే మానసిక, బుద్ధిమాంద్యం ఉన్న వారికి, ఇంటి వద్దే ఉంటున్న వారికి, ఆడపిల్లలకు అలవెన్సులు ఇస్తున్నారు. బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్సు కింద రూ.200 చొప్పున పది నెలలకు రూ.2వేలు, ఆడపిల్లలకు ప్రత్యేకంగా గరల్స్ చైల్డ్ అలవెన్సు కింద రూ.200చొప్పున పది నెలలకు రూ.2వేలు ఇస్తున్నారు. హోమ్ బేస్డ్ అలవెన్సు కింద ఇంటి వద్దే ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి మాత్రమే రూ.200 చొప్పున పది నెలలకు రూ.2వేలు ఇస్తున్నారు. బడికి వెళ్లే వారికి పాఠశాలలో అందరి విద్యార్థులతో పాటు వీరికి యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, షూ, టైలను అందజేయడంతో పాటు వీరికి అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తున్నారు.

మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులు

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గత ఏడాది నవంబరులో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులు నిర్వహించారు. ఈ క్యాంపుల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి 599మందిని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించారు. పరికరాలు అందజేశారు.

> **చక్కటి భవిష్యత్**
>
> 
>
> ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి చక్కటి భవిష్యత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జిల్లాలోని అన్ని మండలాల్లో ఐఈఆర్పీలు సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు 205మంది పిల్లలను గుర్తించారు. వీరందరూ భవిత కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే వారికి ఎటువంటి పరకరాలు అవసరమో వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి వాటిని అందించనున్నాం.
>
> – శేఖర్, డీఈఓ, అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, సమగ్ర శిక్ష, తిరుపతి

న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ



సుదర్శన్ సుందర్‌ని సన్మానిస్తున్న మహిళా జడ్జిలు

తిరుపతి లీగల్ : రాయలసీమ జిల్లాలోని 30 మంది న్యాయమూర్తులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి శ్వేత భవనంలో వివిధ అంశాలపై న్యాయమూర్తులకు శిక్షణ తరగతులు చేపట్టారు. అనంతరం సీనియర్ ట్రెనీలు ప్రసాద్ సుబ్బన్న, సుదర్శన్ సుందర్‌ను న్యాయమూర్తులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ జి.రామ్ గోపాల్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట బందోబస్తు

తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పెషల్ పార్టీ పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు. శాంతిభద్రతల సమస్య వచ్చినప్పుడు స్పెషల్ పార్టీ పోలీసులదే కీలక పాత్రని వెల్లడించారు. కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

అచ్చ తెలుగులో అన్నమయ్య కీర్తనలు



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యుడు రామ సూర్యనారాయణ

తిరుపతి కల్చరల్ : అచ్చ తెలుగు పదాలతో కీర్తనలు రచించి సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అన్నమయ్య పద కవితా పితామహుడిగా ప్రసిద్ధి చెందారని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ రామ సూర్యనారాయణ తెలిపారు. అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహిత్య సదస్సులు ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు అధ్యక్ష వహించిన రామ సూర్యనారాయణ తాళ్లపాక కవులు– పద కవిత్యం అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య సతీమణి తిమ్మక్క సుభద్ర కల్యాణం, కుమారుడు పెద్ద తిరుమలాచార్యులు ద్విపదలో హరివంశం, మనువడు చిన్నన్న ఉషాపరిణయం, అన్నమయ్య చరిత్ర వంటి ద్విపద కవితలను సామాన్యులకు అర్థమయ్యేలా గొప్ప సాహిత్య విలువలతో రచించారని కొనియాడారు. వంశమంతా కవులైన ఖ్యాతి తాళ్లపాక వంశానికే దక్కుతుందన్నారు. అన్నమయ్య పద కవిత్వాన్ని భక్తిపథ కవిత్వంగా మార్చారని వివరించారు. ఆంధ్ర వర్సిటీ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ మలయవాసిని అన్నమయ్య కీర్తనలు– వస్తు వైవిధ్యం అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య మధుర భక్తితో వస్త్రాశయ సాహిత్యం, ఆత్మాశ్రయ సాహిత్యం అనే రెండు అంశాలతో సంకీర్తనలను రచించినట్లు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలను ఆధ్యాత్మిక విభాగంలో నాలుగు సంపుటాలు, శృంగారం విభాగంలో 22 సంపుటాలుగా విభజించినట్లు వివరించారు. కాకతీయ వర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కాత్యాయనివిద్మహే అన్నమయ్య పద కవితలు–లౌకిక విలువల అనే అంశంపై మాట్లాడారు. లౌకిక జీవితం లేకుండా భక్తి లేదని, సమాజంలో, వ్యక్తిగతంగా ఉన్న సమస్యల పట్ల ఆందోళన చెందుతున్న సందర్భంలో భక్తులు అవుతారని తెలిపారు. అన్నమయ్య అనాటి సామాజిక పరిస్థితుల్లో ఆకలి, కష్టాలు భగవంతుడిని గుర్తు చేస్తాయని, తన కీర్తనల ద్వారా తెలిపారని వెల్లడించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ పాల్గొన్నారు.

ప్రియ సిస్టర్స్ గానామృతం

అన్నమాచార్య కళామందిరంలో చెన్నైకి చెందిన ప్రియ సిస్టర్స్ ఆలపించిన భక్తి సంకీర్తనలు శ్రవణానందకరంగా సాగాయి. అన్నమయ్య సంకీర్తనలను తమదైన శైలిలో సుమధురంగా గానం చేస్తూ భక్తుల హృదయాలను మైమరిపించారు. ఈ క్రమంలో తొలుత అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదన్‌రావు బృందం ప్రదర్శించిన భక్తి సంగీతం సభికులను అలరింపజేసింది.

సిద్ధార్థలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థినికి ఇంజనీరింగ్ పట్టా అందజేస్తున్న చంద్రశేఖర్, హేమచంద్రారెడ్డి తదితరులు

నారాయణవనం: సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో శుక్రవారం బీటెక్ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో ఉదయం సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 386 మందికి, మధ్యాహ్నం సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 854 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, ప్రతిభను కనబరిచిన 14 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఏపీసీటీఈ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బుడ్డా చంద్రశేఖర్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా బీటెక్ డిగ్రీ నామమాత్రమేనన్నారు. నైపుణ్య ప్రమాణాలను పెంచుకోవడం ద్వారా పరిపూర్ణ ఇంజినీర్లుగా ఎదగాలని సూచించారు. డబ్బు సంపాదన కోసమే కాకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ అశోకరాజు మాట్లాడుతూ చదువుకోవడం గొప్ప అనుపించుకోదన్నారు. సంస్కారం, క్రమశిక్షణ, అనుభవం తోడైతేనే పరిపూర్ణ స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. వృత్తి విద్యను అభ్యసిస్తున్న యువ ఇంజినీర్లకు సాధన ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ జనార్ధనరాజు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మోడల్ కౌంటింగ్ కేంద్రం



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో శుక్రవారం మోడల్ కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. జూన్ 4వ తేదిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించేందుకు మోడల్ కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం బాక్స్‌ను ఎలా ఓపెన్ చేయాలి, లెక్కింపు పూర్తి అయిన తర్వాత ఎలా క్లోజ్ చేయాలి, వీవీ ప్యాట్‌లను ఎలా పరిశీలించాలి, పోస్టల్ బ్యాలెట్లను ఎలా లెక్కించాలి అనే అంశాలను తెలియజేయనున్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఎక్కడ కూర్చోవాలి, టేబుళ్లను ఎక్కడ ఏర్పాటు చేయాలి, రౌండ్ల వారీగా ఫలితాలను ఎలా ప్రకటించాలని తదితర అంశాలను మోడల్ కౌంటింగ్ కేంద్రంలో వివరించనున్నారు.

డీవైఈఓ పరీక్షకు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న డీఆర్‌ఓ పెంచలకిషోర్

తిరుపతి అర్బన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నేతృత్వంలో శనివారం నిర్వహించనున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ స్క్రీనింగ్ పరీక్షకు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు డీఆర్‌ఓ పెంచల కిషోర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.30 గంటల లోపు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. జిల్లాలోని 11 కేంద్రాల్లో 9 నుంచి 11.30 గంటల వరకు ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షకు 840 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఆలస్యంగా వస్తే పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదని, కేవలం హాల్ టికెట్, గుర్తింపు కార్డు, వాటర్ బాటిల్‌ను మాత్రమే లోపలికి తీసుకెళ్లాలని తెలిపారు. అభ్యర్థుల మొబైలు ఫోన్‌లను డిపాజిట్ చేసుకునేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కోరారు.

మధ్యవర్తిత్వానికి సహకరించాలి



మాట్లాడుతున్న న్యాయ సేవా సంస్థ కార్యదర్శి వెన్నెల

తిరుపతి లీగల్ : మధ్యవర్తిత్వానికి న్యాయవాదుల సహకారం అందించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎస్‌పీడీ వెన్నెల, సీనియర్ ట్రెనీ సుదర్శన్ సుందర్ కోరారు. శుక్రవారం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన హాల్‌లో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి న్యాయ సేవాసంస్థ పలువురు న్యాయవాదులను మధ్యవర్తులుగా నియమిస్తోందన్నారు. మధ్యవర్తిత్వంతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.గోపిచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



రాఘవయ్య మృతదేహం

దొరవారిసత్రం : మండలంలోని ఉచ్చూరు పంచాయతీ ఆర్కేనికండ్రిగ ఎస్సీకాలనీకి చెందిన మొద్దూరు రాఘవయ్య(74) అనే వృద్ధుడి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. రాఘవయ్య మద్యానికి బానిసగా మారి నిత్యం డబ్బుల కోసం కనిపించిన ప్రతి ఒక్కరినీ వేధించేవాడు. ఆ రోజు తాగేందుకు ఎవరూ డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగేశాడు. స్థానికులు గుర్తించి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ రాత్రి మరణించాడు. రాఘవయ్య మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో కార్డెన్ సెర్చ్



తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుమల : తిరుమలలో పోలీసులు గురువారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో బాలాజీ నగర్‌లోని ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. ఏకొల్లు గ్రామానికి చెందిన పునబాక నవీన్(23) తడ మండలం మాంబట్టులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో స్నేహితులతో కలిసి కోటపోలూరులో పార్టీ చేసుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుక వస్తున్న గుర్తుతెలియని వాహనం నవీన్‌పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. మరో బైక్‌పై వస్తున్న స్నేహితులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలోపే ఇద్దరు..

మృతుడి నవీన్ తల్లిదండ్రులు కృష్ణయ్య, సుబ్బరత్నమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరి పెద్దకుమారుడు ప్రవీణ్ కొద్ది నెలల క్రితం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంతలో రెండో కుమారుడిని సైతం రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. ఏడాదిలోపే ఇద్దరు బిడ్డలు దూరమయ్యారని రోదిస్తున్నారు.

మాక్ డ్రిల్

"కౌంటింగ్ రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.. అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తాం.. అల్లరి మూకలను అడ్డుకుంటాం.. ఎక్కడైనా ఘర్షణల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి తరలిస్తాం.. ప్రశాంత వాతావరణంలో జనజీవనం సాగేలా కృషి చేస్తాం" అంటూ ప్రత్యేక పోలీసుల దళం కదం తొక్కింది. శుక్రవారం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద మాక్ డ్రిల్ నిర్వహించింది. క్లిష్ట పరిస్థితుల్లో చేపట్టే చర్యలను ప్రదర్శించింది.

– శ్రీకాళహస్తి







